సాక్షి సిద్దిపేట



బుధవారం, 6, మార్చి, 2024



సభలో మోదీ అభివాదం



సభకు హాజరైన జనం

సభా ప్రాంగణం వద్ద ట్రాఫిక్ జామ్

మోదీ సభకు రావడానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పోలీసులు పలుచోట్ల రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు కష్టమైంది. ఔటర్ సర్వీస్ రోడ్డు అనుకుని వాహనాలను పార్కింగ్ చేయడంతో ఆ దారిలో వచ్చేవారు అవస్థ పడ్డారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

రాజస్థానీయుల సందడి

మోదీ సభకు పటాన్‌చెరు ప్రాంతంలో ఉన్న రాజస్థాన్, గుజరాత్ వాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారి సంప్రదాయ దుస్తుల్లో వచ్చి సందడి చేశారు. తల పాగలు ధరించి బీజేపీ జెండాలతో కేరింతలు కొట్టారు.

చేతివాటం

సభలో చోరులు చేతివాటం చూపించారు. కొందరి పర్స్‌లను మాయం చేశారు. స్థానిక బీజేపీ నేత బైండ్ల కుమార్ బంగారు గొలుసును దొంగలు కొట్టేశారు.

జామర్లతో తికమక

భద్రత దృష్ట్యా పోలీసులు జామర్లను వినియోగించడంతో సభా ప్రాంగణం వద్ద ఫోన్లు పని చేయలేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వాళ్లవారిని కలుసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. వారు ఎక్కడ ఉన్నారో తెలియక అవస్థ పడ్డారు.

తాగునీటికి ఇబ్బంది

సభ వచ్చినవారికి ప్రారంభంలో తాగునీటిని అందించారు. కార్యక్రమం అనంతరం ఎండతాకిడికి దాహానికి తట్టుకోలేకపోయిన ప్రజలు టెంట్ వద్ద ఏర్పాటు చేసిన నీళ్ల బాటిళ్ల కోసం ఎగబడ్డారు. దీంతో కాసేపు తోపులాట జరిగింది.

తారురోడ్డు..

మోదీ సభా ప్రాంగణానికి వచ్చేందుకు కొత్తగా తారు రోడ్డు వేశారు. ఆ దారి వెంట ఆయన ఓపెన్ టాప్ జీప్‌లో వచ్చారు. హెలిప్యాడ్ నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి అభిమానులు ఆయనపై పూల వర్షం కురిపించారు.

ఎమ్మెల్యే ఎక్కడ?

పటాన్‌చెరువులో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి వచ్చిన మోదీని కలవడానికి స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రాలేదు. ప్రధాని చేతుల మీదుగా జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ రోడ్డు అభివృద్ధితో పటాన్‌చెరు ప్రాంత వాసులకు ఉపయోగంగా ఉంటుంది. ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఎమ్మెల్యే కు ఎలాంటి ఆహ్వానం అందలేదని తెలుస్తోంది.

నమోత్సాహం

- ఆకట్టుకున్న మోదీ ప్రసంగం
- తెలంగాణ సెంటిమెంట్ ప్రయోగించిన ప్రధాని
- తమకు మద్దతిస్తే రెట్టింపు సేవలందిస్తామని భరోసా
- ఎన్నికల ప్రచారానికి బీజేపీ శంఖారావం

పటాన్‌చెరు/ పటాన్‌చెరు టౌన్/ రామచంద్రాపురం : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పటాన్‌చెరు సభ ఆ పార్టీ శ్రేణుల్లో ఫుల్‌జోష్ నింపింది. మంగళవారం జరిగిన బీజేపీ విజయ సంకల్ప సభలో మోదీ ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. పటాన్‌చెరు సభ నుంచి దక్షిణాదిలో తెలంగాణ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. ఈ సభకు మెదక్, జహీరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల ప్రాంత బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఇప్పటికే తెలంగాణలో తొమ్మిది స్థానాల్లో బీజేపీ తన అభ్యర్థుల పేరు ప్రకటించిన విషయం విదితమే. మోదీ తన ప్రసంగంలో తెలంగాణ సెంటిమెంట్‌ను ప్రయోగించారు. మధ్యలో తెలుగులో ప్రసంగిస్తూ స్థానికులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. దక్షిణ భారతానికి తెలంగాణ ముఖద్వారంగా ఉంటుందని చెప్పడంతో సభ చప్పట్లతో మారుమోగింది. హిందీలో మాట్లాడుతూనే ఒక్కసారిగా 'బీజేపీకి ఓటు వేయాలని' తెలుగులో అభ్యర్థించారు. 'మోదీ గ్యారెంటీ అంటే.. అది గ్యారెంటీగా గ్యారంటీ' అంటూ సభికులను ఉత్సాహపరిచారు. తాను ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తినని చెబుతూ.. బీజేపీకి మరోసారి అధికారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తనదైన శైలిలో ప్రజలను ఆకట్టుకుంటూ వారి నుంచి స్పందన రాబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తనకు మద్దతు ఇస్తే దానికి రెట్టింపు సేవలందిస్తానని మోదీ వివరించారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని పునరుద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మొత్తానికి మోదీ ప్రసంగం ఆ పార్టీ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావులు ఈ సభను బాగా సద్వినియోగం చేసుకున్నారు. రాష్ట్రానికి వచ్చిన కేంద్ర నిధుల వివరాలను ప్రజలకు అర్థం అయ్యేలా వివరించే ప్రయత్నం చేశారు. కేసీఆర్ ఆరంభించారని చెబుతున్న హరితహారం కార్యక్రమం కూడా కేంద్ర నిధులతోనే చేపట్టారని వివరించారు. తెలంగాణ ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ సభలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్ రెడ్డి, మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్ తదితరులు హాజరయ్యారు. అయితే మెదక్ ఎంపీ అభ్యర్థి ఎవరనేది ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది.



గవర్నర్ తమిళిసైకి కలెక్టర్ స్వాగతం

పటాన్‌చెరు శివారులో ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ విజయ సంకల్ప సభకు గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్ విచ్చేశారు. ఆమెకు మంత్రులతో పాటు కలెక్టర్ క్రాంతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సైడ్ లైట్స్..

మంగళవారం ఉదయం 10:35 గంటలకు పటాన్‌చెరుకు చేరుకున్నారు. 10:40 గంటలకు అధికారిక కార్యక్రమ వేదికకు వచ్చారు. 11:10 గంటల వరకు రూ.7,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను చేశారు. 11: 13 గంటల నుంచి 11: 25 గంటల వరకు మోదీ ఓపెన్ వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజా సంకల్ప సభ వేదిక బహిరంగ సభకు చేరుకున్నారు. 11:30 నుంచి 11:43 వరకు రాష్ట్రవ్యాప్తంగా కేంద్రం చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. 11:50 గంటల నుంచి 12: 26 గంటల వరకు మోదీ ప్రజా సంకల్ప ఎన్నికల సభలో ప్రసంగించారు. 12 30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

- విజయ సంకల్ప యాత్ర సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంతో ప్రాంగణమంతా హోరెత్తింది.
- తెలుగులో మాట్లాడినప్పుడల్లా సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది.
- ఓపెన్ టాప్ జీపులో వచ్చిన మోదీపై పూల వర్షం కురిపించారు.
- శ్రీకాంత్ అనే యువకుడి హెల్మెట్‌పై మోదీ, రామమందిరం ఫొటోలు అతికించుకుని వచ్చి అలరించాడు.
- వాహనాల పార్కింగ్‌ను రామేశ్వరం బండ సమీపంలో ఏర్పాటు చేయడంతో మహిళలు, వృద్ధులు సభ వద్దకు రావడానికి ఇబ్బంది పడ్డారు.





న్యూస్‌రీల్

నాచగిరి .. శివరాత్రికి సన్నద్ధం
నేటి నుంచి విశేష కార్యక్రమాలు



నాచగిరి శివాలయంలో శివుడు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచారం గుట్టలోని శివాలయం శివరాత్రి మహోత్సవ వేడుకలకు సిద్ధమైంది. శ్రీలక్ష్మీనృసింహుని గుహ చెంతనే 55 సంవత్సరాల క్రితం నిర్మితమైన గుడిలో లింగ స్వరూపుడై పరమశివుడు కొలువుదీరాడు. నాటి నుంచి భక్తులు కోరిన కోర్కెలను నెరవేరుస్తాడని విశ్వసిస్తారు. కాగా, నాచగిరి శివాలయంలో బుధవారం నుంచి శనివారం వరకు శివరాత్రి మహోత్సవ వేడుకలు జరుగుతాయని ఈఓ అన్నపూర్ణ తెలిపారు. ''బుధవారం ఉదయం 9.30 గంటలకు నవగ్రహ, రుద్ర హవనములు, నాగవల్లి(తమలపాకుల పూజ). గురువారం ఉదయం హవనములు, పరమేశ్వరునికి అన్నపూజ. శుక్రవారం ఉదయం నవగ్రహ, రుద్ర హవనములు, సాయంత్రం 5 గంటలకు పార్వతి రాజరాజేశ్వర కల్యాణం, రాత్రి 9 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వపత్ర, పుష్పార్చన. శనివారం ఉదయం 11.30 గంటలకు మహాపూర్ణాహుతి, అవభృద స్నానం, తీర్థప్రసాద వితరణ ఉంటుంది. శివరాత్రి వేడుకల్లో భక్తులందరూ పాల్గొని తరించాలి'' అని ఈఓ కోరారు.

పల్స్ పోలియో 100.75 శాతం

సిద్దిపేటకమాన్: జిల్లాలో మూడు రోజులుగా నిర్వహించిన పల్స్ పోలియో 100.75 శాతం నమోదైనట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఐదేళ్ల లోపు 93,667 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. కానీ 94,369 మందికి చుక్కలు వేసినట్లు తెలిపారు. వివిధ శాఖల అధి కారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

రేపు జాబ్ మేళా

సిద్దిపేటఎడ్యుకేషన్: గవర్నమెంట్ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) సిద్దిపేటలో డిపార్ట్ కెమిస్ట్రీ, టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో ఈనెల 7న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కన్వీనర్స్ డాక్టర్ వాసం శ్రీనివాస్, ఇమ్మడి శ్రీనివాస్‌రావు, కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీకృష్ణ ఫార్మా కంపెనీలో ఆర్అండ్‌డీ, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ప్రొడక్షన్ కమిస్ట్ ఉద్యోగాల కోసం బీఎస్సీ కెమిస్ట్రీ చేసిన విద్యార్థులు హాజరు కావాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కళాశాల న్యూ కాన్ఫరెన్స్ హాల్‌కు ఉదయం 10 గంటలలోపు తమ సర్టిఫికెట్స్‌తో రావాలని సూచించారు. వివరాలకు 83099-65743 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పట్టుకు ప్రోత్సాహమేదీ?

ఆరేళ్లుగా రైతుల ఎదురు చూపు

- జిల్లాలో మార్కెటింగ్ సౌకర్యం లేమి
- జనగామ, తిరుమలగిరికి తరలించి విక్రయాలు
- 548 మందికి రూ.1.84కోట్లకు పైగా పెండింగ్
- జిల్లాలో 1,070 ఎకరాల్లో మల్బరీ సాగు

సన్న, చిన్నకారు రైతులకు పట్టు పురుగుల పెంపకం ప్రత్యామ్నాయ వాణిజ్య పంట. పట్టు పురుగులు, మల్బరీ తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇన్సెంటివ్‌లను ప్రకటించింది. కానీ 2018 నుంచి వీరికి ప్రోత్సాహకాలు అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా రూ.1.84కోట్ల వరకు ఇన్సెంటీవ్‌లు పెండింగ్‌లో పడ్డాయి. ఎప్పుడు ఇస్తారోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో పట్టు గూళ్ల మార్కెట్ లేకపోవడంతో జనగామ, సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి మార్కెట్‌లకు రైతులు తరలించి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం కిలో పట్టుకు రూ.75 చొప్పున ఇన్సెంటీవ్ ప్రకటించింది. ప్రతి రైతు మార్కెట్లో అమ్మిన పట్టు గూళ్లకు అదనంగా ఇన్సెంటీవ్ డబ్బులు ఇవ్వాలని ప్రకటించినా 2018 నుంచి ఇవి సిద్దిపేట జిల్లా రైతులకు అందడం లేదు. జిల్లాకు చెందిన 548 మంది రైతులకు రూ 1.84కోట్లు ఇన్సెంటీవ్ రావాలి. జనగామ మార్కెట్‌లో 280 మందికి రూ. 94,30,050, తిరుమలగిరి మార్కెట్‌లో 268 మందికి విక్రయించగా రూ. 90లక్షలు ఇన్సెంటీవ్‌లు ప్రభుత్వం చెల్లించాలి. ప్రోత్సాహకాలు రాకపోవడంతో పట్టు రైతులు ఆర్థిక భారంతో కుంగిపోతున్నారు. అయితే ఇవి రాకపోవడానికి గల కారణాలు అధికారులు చెప్పలేకపోతున్నారు. ఆపై వస్తాయంటూ వారికి చెబుతూ వస్తున్నారు.

ఆశగా..

జిల్లాలో 1,070 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. చిన్నకోడూరు, బెజ్జంకి, కొండపాక, తొగుట, సిద్దిపేట, కొమురవెల్లి మండలాల్లో రైతులు ఆరేళ్లుగా ఇన్సెంటీవ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వమైనా పట్టించుకుని ప్రోత్సాహకాలు అందించాలని వారు కోరుతున్నారు.



పట్టు పురుగుల పెంపకం

రూ.4 లక్షలకు పైగా బకాయిలు



25 ఏళ్లుగా పట్టు పురుగుల పెంపకం చేపట్టాను. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్సెంటీవ్‌లు 2018 నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. నాకు రూ.4లక్షలకు పైగా బకాయి ఉంది. వాటిని వెంటనే విడుదల చేసి ఆదుకోవాలి.

– పెద్దోళ్ల నర్సింహులు, పట్టు రైతు, చంద్లాపూర్

అందజేస్తే ఆసరాగా ఉంటుంది



ప్రత్యామ్నాయ పంటగా పట్టు పురుగుల పెంపకం చేస్తున్నా. 2021 నుంచి ప్రభుత్వం ఇచ్చే ఇన్సెంటీవ్ రూ.2లక్షలు బకాయి ఉంది. ప్రభుత్వం వెంటనే చెల్లిస్తే ఎంతో ఆసరాగా ఉంటుంది. ఎన్ని మార్లు అధికారులకు చెప్పిన రేపు మాపు అంటున్నారే తప్ప ఇన్సెంటీవ్‌లు అందజేయడం లేదు.

– పిల్లి శ్రీనివాస్, పట్టు రైతు, చంద్లాపూర్

రఘునందన్ వైపే మొగ్గు?

- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థిగా ఖరారు?
- రెండు రోజుల్లో ప్రకటించే చాన్స్
- లాయర్‌గా అందరికీ సుపరిచితులన్న చరిష్మా నరేసరి
- లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో తిరుగుతున్న ఆయన ప్రచార రథాలు



దుబ్బాకటౌన్ : బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాధవనేని రఘునందన్‌రావు పేరు ఖరారైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆయన వైపే బీజేపీ అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. సానుకూల సంకేతాలు రావడంతోనే 20 రోజులుగా ఎన్నికల కదనరంగంలోకి దూకినట్లు కనబడుతుంది. మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఆయన ప్రచార రథాలు తిరుగుతుండటంతో టికెట్ పక్కా అయినట్లు జరుగుతున్న ప్రచారానికి బలం చేకురినట్లు అవుతుంది. పార్లమెంట్ పరిధిలోని దుబ్బాకతో పాటు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, గజ్వేల్ పట్టణాలతో పాటు చాలా చోట్ల ఆయన పేరిట భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం రోజునే ముఖ్య పట్టణాల్లో బలరాముడు, ప్రధాని మోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఆయనతో కూడిన భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. మరో వైపు మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న విజయ సంకల్ప యాత్రలు ఈయన ఆధ్వర్యంలో జరుగుతుండటం, మంగళవారం సైతం పటాన్‌చెరులో ప్రధాని మోదీ సభా ఏర్పాట్లలో కీలకంగానూ వ్యవహరించినట్లు తెలిసింది. ఆయనకు మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలపై పట్టు ఉండటంతో టికెట్ కేటాయిస్తే తప్పకుండా గెలుస్తామనే నమ్మకంతో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తుంది. సంగారెడ్డి కోర్టులో లాయర్‌గా అందరికీ సుపరిచితుడే. ఇక సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, గజ్వేల్ నియోజకవర్గాలతో సైతం ప్రత్యేక సంబంధాలు ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొనే బరిలో దింపేందుకు సిద్ధమైనట్లుగా సమాచారం. అధికారికంగా రెండు రోజుల్లో పేరు ఖరారు కానున్నట్లు తెలిసింది.

రంజుగా కొండపాక రాజకీయం

- ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం
- కొండపాక ఎంపీటీసీకి పదవి దక్కే చాన్స్
- అవిశ్వాసం నెగ్గినా.. కుర్చీ బీఆర్ఎస్‌దే



తీర్మానం ప్రతిని ఆర్డీఓ బన్సీలాల్‌కు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

కొండపాక(గజ్వేల్): కొండపాకలో రాజకీయాలు రంజుగా మారాయి. ఉన్న ఎంపీపీని దింపి కొత్త అభ్యర్థి ఎంపిక కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. మంగళవారం ఎంపీపీ పదవిపై అవిశ్వాస తీర్మాన ప్రతిని తొమ్మిది ఎంపీటీసీ సభ్యులు పిల్లి శిరీష, పత్తి ఆంజనేయులు, చింతల సాయిబాబా, మంచాల అనుసూయ, ఆరుట్ల లక్ష్మి, నందాల శ్రీనివాస్, గురజాడ బాలాజీ, విరుపాక ప్రణవీ, బూరమైన భూములుగౌడ్‌లు గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్‌కు అందజేశారు. ప్రస్తుతం ఎంపీపీగా ర్యాగల్ల సుగుణ ఉన్నారు. అభివృద్ధిని, ఎంపీటీసీల సమస్యలను పెడచెవిన పెడ్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. గతంలో ఎంపీపీ పదవిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎంపీటీసీలు ప్రయత్నం చేయగా బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ ఆలోచన మళ్లీ కార్యరూపం దాల్చింది. ప్రస్తుతం బీఆర్ఎస్‌దే ఎంపీపీ పీఠం.. ఒకవేళ అవిశ్వాసం నెగ్గినా .. ఆపార్టీకే పదవి దక్కుతుంది. కొండపాక ఎంపీటీసీ మంచాల అనసూయకే పదవి దక్కే అవకాశాలున్నట్లు ప్రచారం సాగుతోంది. ఉమ్మడి కొండపాక మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఎంపీపీ అధ్యక్ష పదవి బీసీ మహిళకు రిజర్వు అయ్యింది. 2019లో జరిగిన ఎన్నికల్లో 8 బీఆర్ఎస్, 3 కాంగ్రెస్, 3 స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. దీంతో ఎంపీపీగా సుగుణను ఎన్నుకున్నారు. ముగ్గురు స్వతంత్ర ఎంపీటీసీలు బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ బలం 11 మందికి చేరింది. కుకునూరుపల్లి ఎంపీటీసీ-2 (కాంగ్రెస్) రెడ్డమైన గీత అనారోగ్యంతో మృతిచెందారు. ఆపార్టీకి నుంచి ఇద్దరు ఎంపీటీసీలే ఉన్నారు. మొత్తంగా 13 మంది ఎంపీటీసీ పదవుల్లో కొనసాగుతున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి

సేవా కేంద్రాలను వినియోగించుకోవాలి

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల లబ్ధి పొందేందుకు జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకునేలా అధికారులు కృషి చేయాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశించారు. సోమవారం ఈ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్‌లో వారితో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మను చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 5 మున్సిపాలిటీలు, 23 ఎంపీడీఓ కార్యాలయాలలో ప్రజా పాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.అర్హత కలవారు సంక్షేమ పథకాల కోసం ఆధార్, రేషన్ కార్డ్, విద్యుత్ బిల్లు, గ్యాస్ పాస్ బుక్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అమ్మ దర్శనం.. భక్తజన పరవశం



అమ్మ వారి దివ్యమంగళ రూపం

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి నెలవైన వర్గల్‌లో.. విద్యాసరస్వతీ క్షేత్రం మంగళవారం మూల మహోత్సవ వైభవంతో అలరారింది. జన్మనక్షత్ర వేళ అమ్మవారికి లక్ష పుష్పార్చన నేత్ర పర్వం చేసింది. విద్యాప్రదాయిని హంస వాహిని అమ్మవారి దివ్యదర్శనంతో భక్త జనావళి పరవశించింది. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో మాత మూలవిగ్రహానికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం అలంకార సేవ చేశారు. సర్వాలంకార శోభితులైన అమ్మకు ఆలయ మహా కలశ మండపం వేదికగా భక్తజన సామూహిక లక్ష పుష్పార్చన నిర్వహించారు. లలితా పారాయణం, సప్తశతీ, చండీ పారాయణం, చండీహోమాది కార్యక్రమాలు నిర్వహించారు. చతుషష్ట్యోపచార పూజలు, కుంకుమార్చన జరిపారు. వేడుకలో భక్తులు పాల్గొని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.



లక్ష పుష్పార్చనలో మహిళలు

క్లుప్తంగా

కారు నడుపుతుండగానే గుండెపోటు

● పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌గౌడ్ మృతి



శంకర్‌గౌడ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల రైతు సహకార సంఘం చైర్మన్ గౌడ శంకర్‌గౌడ్(58) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తుండగా మార్గ మధ్యలో మేడ్చల్ వద్ద గుండెపోటుకు గురై కారును పక్కకు నిలిపివేసి కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మరో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ చిందం సబిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు నార్సింగి చేరుకొని శంకర్‌గౌడ్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించొచ్చు

● ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ హరీశ్



పాపతో డాక్టర్ హరీశ్

సిద్దిపేటకమాన్: క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే వ్యాధిని జయించొచ్చని ప్రముఖ అంకాలజిస్టు వైద్యుడు డాక్టర్ కంచర్ల హరీశ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట పట్టణానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి కాళ్ల నొప్పుల సమస్యతో బాధపడుతూ తమ దగ్గరికి వచ్చిందన్నారు. ఆమెకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి బ్లడ్ క్యాన్సర్‌గా నిర్ధారించామన్నారు. రెండేళ్లుగా ఆమెకు 11 సెషన్ల కిమో థెరపీ వైద్య చికిత్స అందించడం ద్వారా పూర్తిగా వ్యాధి నయమైందన్నారు. ముందుగా వ్యాధిని గుర్తించి చికిత్స అందించడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ప్రస్తుతతం పాప ఆరోగ్యం బాగుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండి, ప్రతీ నిత్యం వ్యాయాయం చేయాలని సూచించారు.

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో శవమై తేలి

● తిగుల్ గ్రామంలో వ్యక్తి మృతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలిన ఘటన మండలంలోని తిగుల్ గ్రామంలోని మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎల్లం శివయ్య(58) గ్రామంలోనే వివిధ రకాల పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. 3వ తేదీన ఉదయం గ్రామంలో రేషన్ బియ్యం తీసుకొచ్చి అనంతరం మళ్లీ వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామంలోని మహాసముద్రం వైపు వెళ్లిన ఇద్దరు వ్యక్తులకు చెరువులో మృతదేహం తేలి కనిపించడంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. జగదేవ్‌పూర్ ఎస్‌ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హెల్మెట్‌కు ఒకవైపు ప్రధాని మోదీ, మరోవైపు రామ మందిరం ఫొటోతో శ్రీకాంత్



బీబీ పాటిల్‌తో మాట్లాడుతున్న మోదీ



రఘునందన్‌రావుతో..



విజయ సంకల్ప సభకు హాజరైన ప్రజలు

ఫుల్ జోష్..

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో మంగళవారం నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప సభకు అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మోదీ.. మోదీ నినాదంతో సభా ప్రాంగణం మార్మోగింది. ప్రధాని మోదీ ప్లకార్డులు చేత పట్టుకొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. మరికొందరు మోదీ సభా ప్రాంగణానికి రాకను, ప్రజలనుద్దేశించి సభలో మాట్లాడుతుండగా తమ ఫోన్లలో బంధించారు.



ప్లకార్డుతో ఉత్సాహంగా..





మోదీ ప్రసంగాన్ని సెల్‌ఫోన్లలో బంధిస్తున్న అభిమానులు, కార్యకర్తలు



సభలో ఉత్సాహంగా మహిళలు



ప్లకార్డులతో చూయిస్తున్న అభిమానులు



మోదీ చిత్రంతో చిన్నారులు



మోదీ తల్లి ఫొటోతో కార్యకర్త

మురికిపాయల.. మునిగేదెలా?

కాలుష్య కాసారంగా మంజీరా

పవిత్ర మంజీర కాలుష్య కాసారంగా మారింది. గుర్రపు డెక్కలు.. కలుషిత నీటితో ఏడుపాయల మురికి కూపాన్ని తలపిస్తోంది. జాతర కోసం తొమ్మిదేళ్లలో రూ.10.55 కోట్లు మంజూరైనా శాశ్వత పనులు చేపట్టకుండా, తాత్కాలిక పనులతో సరి పెడుతున్నారు. దీంతో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఏడుపాయల పరిస్థితి తయారైంది. జాతర వచ్చిందంటే ఆలయానికి వచ్చే భక్తులకు వసతులు లేక చెట్ల కిందే టెంట్లు వేసుకొని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. తాత్కాలిక టాయిలెట్లు, రక్షణ లేని డ్రెస్సింగ్ రూములతో భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల్లో జాతర ప్రారంభంకానున్న నేపథ్యంలో ఏడుపాయలపై ప్రత్యేక కథనం....

– పాపన్నపేట(మెదక్)

- అసౌకర్యాల మధ్య ఏడుపాయల
- 8వ తేదీ నుంచి జాతర ప్రారంభం
- గదులు లేక టెంట్లు, చెట్ల కిందే భక్తులు
- అధ్వానంగా టాయిలెట్లు, రక్షణ లేని డ్రెస్సింగ్ రూమ్‌లు
- తాత్కాలిక పనులతో సరిపెడుతున్న సిబ్బంది



సత్రం పక్కన నిలిచిన మురికి నీరు

తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచిన ఏడుపాయల్లో ఏదైనా జాతర ప్రారంభమైందంటే చాలు సుమారు 10 లక్షల మంది భక్తులు తరలివస్తారు. మంజీరా నదిలో స్నానాలు చేసి దుర్గమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ఈనెల 8 తేదీన మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జాతర జరుగనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో రానున్నారు. కానీ ఏడుపాయల్లో అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు కనిపించడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక, జాతరలోని మురికి నీరంతా మంజీరా నదిలో చేరుతుంది. కొంత కాలంగా గుర్రపు డెక్క నది పాయల్లో అల్లుకుపోయింది. దీన్ని తొలగించేందుకు 15 రోజులుగా 15 మంది గజ ఈతగాళ్లు ప్రయత్నిస్తున్నా కనీసం 40 శాతం పూర్తి కాలేదు. చెక్ డ్యామ్ వద్ద నదిని ఆనుకొని భక్తులు బహిర్భూమికి వెళ్తున్నారు. చనిపోయిన కుక్కల కళేబరాలు పురుగులు పడి దుర్వాసన వెద జల్లుతున్నాయి. భక్తులకు మురికినీటిలో ముక్కు మూసుకొని మునగాల్సిన దుస్థితి నెలకొంది.

తాత్కాలిక పనులతో కాలం వెళ్లదీత..

స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ కింద ఏటా జాతరకు మంజూరు చేసే నిధుల్లో ఎక్కువ భాగం తాత్కాలిక పనులకు కేటాయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లైటింగ్, టెంట్లు, తడకల పందిళ్లు, బ్యారికేడ్లు, సీసీ కెమెరాలు, మొరం కొట్టడం, ట్యాంకర్లు, గజ ఈతగాళ్లు వంటి వాటికి ఖర్చు చేస్తుంటారు. వివిధ డిపార్ట్‌మెంట్‌ల ద్వారా పనులు చేపడుతున్నప్పటికీ స్థానిక నాయకులు అధికారులు మిలాఖత్ అయ్యి కమీషన్లు పొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఆలయ పాలక వర్గ చైర్మన్లు తమకు అనుకూలమైన వారికి తాత్కాలిక ఉద్యోగులుగా నియమించుకుంటున్నారు. కావాల్సినంత సిబ్బంది ఉన్నా ఏడుపాయల్లో సమస్యలు మాత్రం ఎక్కడి కక్కడే ఉన్నాయి. సత్రాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటుంది. టాయిలెట్ మధ్యలో ప్లాస్టిక్ బాటిళ్లు దర్శనమిస్తుంటాయి. జన సామర్థ్యం ఉండే షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ప్రమాదమని తెలిసినా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. చేతికందే పరిస్థితిలో వైర్లు వేలాడుతున్నాయి.



గుర్రపు డెక్క, మురికి నీటితో కాలుష్య కాసారంగా మారిన ఏడుపాయల



తాగు నీటి నల్లాల వద్ద అపరిశుభ్ర పరిస్థితి

శాశ్వత పనులు చేపట్టాలి

జాతర కోసం వచ్చే ఎస్‌డీఎఫ్ నిధులతో కొన్ని శాశ్వత పనులు చేపడితే సమస్యలు తీరిపోతాయి. లేకుంటే ప్రతీసారి అవే పనులకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆ దిశగా సూచనలు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. బుధవారం నాటికి సింగూరు నీరు ఘనపురం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో చేరుతాయి. గుర్రపు డెక్క తొలగించడం ఎంత వరకు అయితే అంత వరకు చేపడుతాం. పారిశుద్ధ్యత పై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– మోహన్‌రెడ్డి ఆలయ ఈవో

భక్తులకు నిలువ నీడలేదు

జాతర స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు కాకుండా ఏడుపాయలకు ఏటా సుమారు రూ.8 కోట్ల ఆదాయం వస్తుంది. అయినా భక్తుల కోసం సత్రాలు నిర్మించలేకపోయారు. ఇక్కడ 47 సత్రాలు ఉండగా అందులో 45 దాతలవే. జాతరకు దాతలు వస్తారు కాబట్టి ఆ సత్రాలు వారికే కేటాయించాల్సి ఉంటుంది. మిగిలిన సత్రాలు ఏమైనా ఉంటే వివిధ శాఖల అధికారులకు కేటాయిస్తారు. జాతరలో రెండు రోజులు గడిపి పోదామని వచ్చే భక్తులకు అడవిలోని చెట్ల నీడే దిక్కవుతుంది. కొంత మంది టెంట్లు వేసుకొని సేద దీరుతారు. కాలకృత్యాల కోసం మహిళలు నానా అవస్థలు పడాల్సిన దుస్థితి. ఇక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక టాయిలెట్లు, డ్రెస్సింగ్ రూములు గట్టిగా గాలి వస్తే ఎగిరి పోయే పరిస్థితి.



టాయిలెట్‌లో ప్లాస్టిక్ బాటిళ్లు

రైలు నుంచి పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్ మండలం కూచారం తండాలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి సికింద్రాబాద్‌కు రైలులో ప్రయాణం చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి విద్యుత్ పోల్‌కు ఢీకొన్నాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు 35 ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని రైల్వే అధికారులను అడుగగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గాంధీకి తరలించినట్లు తెలిపారు.

సైకిల్ పై వెళ్తూ చెరువులో పడి..

● ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



రవి మృతదేహం

మర్కూక్(గజ్వేల్): ప్రమాదవశాత్తు చెరువులో పడ్డి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఇప్పలగూడెం గ్రామానికి చెందిన జిలకర రవి (35) పనుల నిమిత్తం గ్రామం నుంచి పాములపర్తి గ్రామానికి సైకిల్‌పై వెళ్తున్నాడు. రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి ప్రమాదవశాత్తు సైకిల్ వెళ్లిపోవడంతో అతను చెరువు గట్టు పక్కన పడిపోయాడు. అతడి బంధువైన జిలకర నర్సింలుకు ఫోన్ చేసి నేను చెరువులో పడిపోయాను త్వరగా రావాలని చెప్పాడు. వెంటనే వెళ్లి చూసే సరికి చెరువులో పడిపోయాడు. రవి మద్యం సేవించి ఉన్నాడని ఫోన్ చేసిన అనంతరం మళ్లీ చెరువులో కాలు జారి పడిపోవడంతో మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరణమే శరణ్యమని..

● వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య ● చిన్నశంకరంపేటలో ఇద్దరు, మర్కూక్‌లో ఒకరు

వేర్వేరు చోట్ల మంగళవారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిన్నశంకరంపేటలో ఆర్థిక ఇబ్బందులు, మనోవేదనతో ఇద్దరు, మర్కూక్‌లో భార్య కాపురానికి రావడం లేదని ఒకరు చనిపోయారు.

ఆర్థిక ఇబ్బందులతో..

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి మండలంలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. వల్లూర్ గ్రామానికి చెందిన ఆనందాస్ మహేశ్ (35) వ్యవసాయ కూలీగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ భూమిని అమ్ముకున్నాడు. అయినా అప్పులు తీరలేదని మానసిక వేదనతో ఆత్మహత్యనే శరణ్యమని భార్య భాగ్యలక్ష్మితో తరుచూ ఆవేదన వ్యక్తం చేసేవాడు. సోమవారం రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన మహేశ్ గ్రామ సమీపంలోని మాటగుట్టపై చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం గమనించిన గ్రామస్తులు మహేశ్ భార్య భాగ్యలక్ష్మికి సమాచారం అందించారు. భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానసిక వేదనతో..

మానసిక వేదనతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన సాయన్నల నర్సింహులు(50) సోమవారం సాయంత్రం గవ్వలపల్లికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లకుండా మద్యం సేవించడంతోపాటు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నర్సింహులు మృతదేహం

భార్య కాపురానికి రావడం లేదని..

మర్కూక్(గజ్వేల్): ఉరి వేసుకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పల గూడెం గ్రామానికి చెందిన నాగరాజు (32) మద్యానికి బానిసై భార్య నవ్యతో తరచూ గొడవ పెట్టుకునేవాడు. దీంతో ఆమె దౌల్తాబాద్ మండలం రాయపోల్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. సోమవారం భార్యను పంపిచాలని రాయపోల్‌కు వెళ్లి మామతో గొడవపడ్డాడు. కూతురు పంపించలేమని నవ్య తల్లిదండ్రులు చెప్పారు. సాయంత్రం ఇంటికొచ్చి పడుకున్న నాగరాజు మంగళవారం ఉదయం తల్లిదండ్రులు చూసేసరికి ఉరి వేసుకొని కనిపించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిశ్రమలో పేలిన రియాక్టర్

● నలుగురికి తీవ్ర గాయాలు



పరిశ్రమలో కాలిపోయిన సామగ్రి

హత్నూర(సంగారెడ్డి): పరిశ్రమలో రియాక్టర్ పేలి నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలం గుండ్ల మాచునూరు గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండలం, గ్రామానికి చెందిన కార్మికుడు వినోద్‌తోపాటు బీహార్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు కార్మికులు కోవలెంట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఇందులో సాదిన్, ఫాదర్ మరండి, బాబ్ బబునుడితోపాటు వినోద్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై పరిశ్రమ యాజమాన్యాన్ని సంప్రదించగా ప్రమాదం జరిగిన విషయం వాస్తవమే అని తెలిపారు.

తమ్ముడిని నరికి చంపిన అన్న

- చెట్ల తొలగింపు విషయంలో తగాదా
- కోహెడ మండలంలో ఘటన

కోహెదరూరల్(సిద్దిపేట): క్షణికావేశం నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. చెట్లు తొలగిస్తున్న సమయంలో ఇద్దరు సోదరుల మధ్య వివాదం జరుగగా గొడ్డలితో తమ్ముడిపై అన్న దాడి చేసి చంపిన ఘటన కోహెడ మండలంలోని వింజపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ముల తిరుపతి రెడ్డి, కోమ్ముల శ్రీనివాస్‌రెడ్డి(32) ఇద్దరు అన్నాదమ్ముళ్లు. ఒక్కొక్కరికి ఆరు ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ బావి వద్ద ఇద్దరి మధ్యలో గట్టుపై చెట్లు ఉండడంతో అన్న తిరుపతిరెడ్డి మంగళవారం కూలీలను పెట్టి తొలగిస్తున్నాడు. ఓ చెట్టుకు విద్యుత్ స్టార్టర్ డబ్బా ఉండడంతో దాన్ని తొలగించారు. శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ పొలాలకు మోటారు ద్వారా అందాల్సిన నీరు అందలేదు. దీంతో ఆయన కూలీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ అన్న తిరుపతిరెడ్డి చెట్లను తొలగించమంటేనే తొలగిస్తున్నామని మమ్మల్ని తిట్టవద్దని గొడవపడ్డారు. అన్నాదమ్ముళ్ల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగి తిరుపతిరెడ్డి గొడ్డలి తీసుకొని శ్రీనివాస్‌రెడ్డి మెడపై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. కూలీలు, తిరుపతిరెడ్డి అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి ఏసీపీ సతీష్, సీఐ కిరణ్, ఎస్‌ఐ తిరుపతి విచారణ జరిపారు. మృతుడి భార్య నాగశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తుల విషయంలో గొడవ

● బండరాళ్లు, కర్రలతో కొట్టుకోవడంతో ఒకరు మృతి

పాపన్నపేట(మెదక్): దాయాదుల మధ్య ఆస్తుల విషయంలో జరుగుతున్న గొడవ ఒకరి హత్యకు దారి తీసింది. ఇరువురి మధ్య దాడిలో తీవ్ర గాయాలతో ఒకరు మృతి చెందిన ఘటన కుర్తివాడలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుర్తివాడకు చెందిన మెట్టు రాములు (36), యశోద దంపతులకు కుమారులు లక్ష్మయ్య, యాదగిరి, కూతురు విజయలక్ష్మి ఉన్నారు. కొన్నేళ్లుగా ఇంటి పక్కన ఉండే పాలివారితో ఆస్తి, భూమి విషయాల్లో తగాదాలు జరుగుతున్నాయి. పలుమార్లు పంచాయతీలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. సోమవారం రాత్రి ఇదే విషయమై గొడవ మొదలైంది. దాయాదులు, బంధువులైన మెట్టు సావిత్రి, మెట్టు కిష్టమ్మ, మెట్టు మోహన్, మరి కొందరు కలిసి మెట్టు లక్ష్మయ్యపై బండరాళ్లు, కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై వివరించారు.